

నలుగురు సీఐల బదిలీ

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీ చేస్తూ సీపీ శంఖబ్రతబాగ్చి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. గాజువాక ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న వి.కోటేశ్వరరావును సిటీ ట్రైనింగ్ సెంటర్‌కు బదిలీ చేశారు. సీటీసీలో పనిచేస్తున్న ఎల్.సన్యాసినాయుడును గోపాలపట్నం సీఐగా నియమించి, అక్కడ పనిచేస్తున్న ఎన్‌వీ ప్రభాకరరావును కంట్రోల్‌రూమ్‌కు బదిలీచేశారు. కంట్రోల్‌రూమ్‌లో పనిచేస్తున్న షేక్ హుస్సేన్‌ను గాజువాక ట్రాఫిక్ సీఐగా బదిలీ చేశారు.



డబుల్ డెక్కర్ బస్సులో ప్రయాణిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

నగరంలో సందడే సందడి

ముఖ్యులంతా విశాఖలోనే...
- అటు సీఎం, ఇటు డిప్యూటీ సీఎం... మరోవైపు ఐటీ మంత్రి

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నగరం వీవీఐపీలతో శుక్రవారం సందడిగా మారింది. ఒకేసారి అనేక కార్యక్రమాలు వేర్వేరు వేదికలపై ఏర్పాటుకావడం, మంత్రులు, పారిశ్రామిక ప్రముఖులు రావడంతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పార్టీ సమావేశాల కోసం గురువారం నుంచి ఇక్కడే ఉన్నారు. శుక్రవారం ఉదయం రుషికొండ ప్యాలెస్ సందర్శనకు వెళ్లారు. ఆ తరువాత 25 పార్లమెంటు నియోజకవర్గాల నుంచి వచ్చిన పార్టీ నాయకులతో బీచ్ రోడ్డులోని బే వ్యూ హోటల్‌లో సమావేశమయ్యారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం సాయంత్రమే నగరానికి వచ్చారు. పార్టీ కార్యాలయంలో రాత్రి బస చేసి అక్కడే శుక్రవారం ఉదయం ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి ఆయన సుడిగాలి పర్యటన చేశారు. పీఎం పాలెం 'వి' కన్వెన్షన్ సెంటర్‌లో చార్టర్డ్ అకౌంటెంట్ల సమావేశానికి హాజరయ్యారు. చంద్రపాలెం పాఠశాలలో ఏఐ లేబొరేటరీ ప్రారంభించారు. అక్కడి నుంచి రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళ్లి సైయంట్ సంస్థ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఏఐ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. సాయంత్రం అక్కడే మహిళా క్రికెటర్లతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. మధ్యలో నోవాటెల్ హోటల్‌కు వెళ్లి ఏరోస్పేస్ టెక్నాలజీ సదస్సులో పాల్గొన్నారు. అలాగే బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జాతీయ క్రీడా దినోత్సవంలో పాల్గొన్నారు. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మధ్యాహ్నం విశాఖపట్నం చేరుకొని బీచ్ రోడ్డులో పర్యాటక శాఖకు చెందిన డబుల్ డెక్కర్ బస్సులను ప్రారంభించారు. వీటి కొనుగోలుకు విశాఖపట్నం పోర్టు రూ.4 కోట్లు సమకూర్చింది. అక్కడి నుంచి నోవాటెల్‌కు

... మిగతా 6వ పేజీలో



రుషికొండ భవనంలోని గదిలో ఊడిన ఫాల్స్ సీలింగ్‌ను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్



చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారా లోకేశ్

నంబర్‌వన్‌గా విశాఖ

టెక్నాలజీ హబ్‌గా నగరం

- పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తాం
- ఇక్కడకు వస్తే కొత్త ఉత్సాహం వస్తుంది
- మహిళలకు సురక్షిత నగరంగా గుర్తింపు పొందడం ఏపీకి గర్వకారణం
- బీచ్‌రోడ్డులో డబుల్ డెక్కర్ బస్సుల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ అంటేనే ప్రశాంతతకు మారుపేరని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కితాబునిచ్చారు. నగరవాసులంతా మంచి మనస్సు కలిగినవారన్నారు. ఒకవైపు సముద్రం...మరోవైపు కొండలు కలిగిన విశాఖ వస్తే తనకు కొత్త ఉత్సాహం వస్తుందన్నారు. భవిష్యత్తులో విశాఖను దేశంలోనే నంబర్ వన్ నగరంగా అభివృద్ధి చేస్తానన్నారు.



నోవాటెల్ హోటల్‌లో శుక్రవారం ఇండియా ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. చిత్రంలో పరిశ్రమల మంత్రి టీజీ భరత్, ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మోహిత్‌సింగ్లా, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ కార్యదర్శి చిరంజీవి చౌదరి ఉన్నారు



డబుల్ డెక్కర్ బస్సులో ప్రయాణిస్తూ సీఎం చంద్రబాబునాయుడు అభివాదం



ఇండియా ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

బీచ్‌రోడ్డులో డబుల్ డెక్కర్ బస్సులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మహిళలకు సురక్షిత నగరంగా విశాఖ గుర్తింపు పొందడం ఏపీకి గర్వకారణమన్నారు. నగరానికి బీచ్ పెద్ద అడ్వంటేజ్ అని, దానిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటకులను ఆకట్టుకునేందుకు వీలుగా బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దీనివల్ల పర్యాటకం అభివృద్ధి చెంది అందరికీ మంచి జరుగుతుందన్నారు. డబుల్ డెక్కర్ బస్సు బీచ్‌రోడ్డులో ఉన్న 14 సందర్శనీయ ప్రాంతాలను

... మిగతా 6వ పేజీలో

ప్రజల ఆకాంక్షలను గుర్తించండి

అందుకు అనుగుణంగా నడుచుకోండి

నాయకులకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం



బేవ్యూ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రసంగిస్తున్న పవన్‌కల్యాణ్, హాజరైన వీర మహిళలు, జన సైనికులు

- పార్టీ నిలదొక్కుకోవడానికి జన సైనికులు, వీర మహిళలే కారణం
- విశాఖ నగరంతో పార్టీకి విడదీయలేని అనుబంధం
- కూటమితో కలిసి ఉంటూనే పార్టీ బలోపేతం: ఎమ్మెల్యే సుందరపు
- రుషికొండ ప్యాలెస్‌పై త్వరగా నిర్ణయం తీసుకోవాలని పార్లమెంటరీ నియోజకవర్గాల కార్యకర్తల సమావేశంలో తీర్మానం
- నేడు ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో క్రియాశీలక కార్యకర్తల సమావేశం

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నిలదొక్కుకోవడానికి జన సైనికులు, వీర మహిళలే కారణమని అధినేత కె.పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం బే వ్యూ హోటల్‌లో నిర్వహించిన పార్లమెంటరీ నియోజకవర్గ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఓటమిని తాను అనేకసార్లు, అనేక విధాలుగా ఎదుర్కొన్నానన్నారు. అయితే జనసైనికులంతా తనకు కష్టాల్లో అండగా నిలిచారని ప్రశంసించారు. తాను ఒక ఫ్రేమ్

... మిగతా 6వ పేజీలో



ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

- రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం...
- డీఆర్‌ఎం పర్యవేక్షణలో పునరుద్ధరణ పనులు

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం డివిజన్‌లోని విజయనగరం స్టేషన్ వద్ద శుక్రవారం ఉదయం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. రెండు వ్యాగన్లు బోల్తా పడ్డాయి. ఈ ఘటనతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విశాఖ-విజయనగరం, విశాఖ-పలాస, విశాఖ-బ్రహ్మపూర్, విశాఖ-కొరాపుట్ మధ్య నడిచే పాసింజర్ రైళ్లతోపాటు విశాఖ-దుర్గ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (22820), విశాఖ-దుర్గ్ ఎక్స్‌ప్రెస్ (18530) రైళ్లను శుక్రవారం రద్దు చేశారు. విశాఖ-భవానీపట్న మధ్య

... మిగతా 6వ పేజీలో

1, 2 తేదీల్లో టీయూ-142 మ్యూజియం మూసివేత

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్కే బీచ్‌రోడ్డులోని టీయూ-142 విమాన మ్యూజియాన్ని నిర్వహణ పనుల కోసం సెప్టెంబరు 1, 2 తేదీల్లో మూసివేస్తున్నట్టు వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ శుక్రవారం తెలిపారు. తిరిగి మూడో తేదీ అంటే బుధవారం నుంచి యథావిధిగా సందర్శకులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

సకాలంలో స్థానిక ఎన్నికలు

పాలకవర్గాల కాలపరిమితి ముగిసిన వెంటనే నిర్వహిస్తాం

త్వరలో మిగిలిన నామినేటెడ్ పదవులు భర్తీ

- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి

నగర టీడీపీ నేతలతో మంత్రి లోకేశ్

- డిప్యూటీ మేయర్-2పై అవిశ్వాసం పెట్టాలని సూచన

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల పాలక వర్గాల కాలపరిమితి ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో విజయం సాధించడానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు ఇప్పటి నుంచే ప్రణాళికలు అమలు చేయాలని, ప్రతి ఒక్కరూ తమ పరిధిలో ప్రజలు, పార్టీ శ్రేణులకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు.



పాఠశాలల్లో ఏఐ ల్యాబ్స్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న మంత్రి నారా లోకేశ్. చిత్రంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు 'సైయంట్' అధినేత బీవీఆర్ మోహనరెడ్డి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ఉన్నారు

రెండు రోజుల నగర పర్యటనకు వచ్చిన ఆయన్ను శుక్రవారం ఉదయం జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ, విశాఖ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, తదితరులు పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రెండో డిప్యూటీ మేయర్ ఎన్నిక విషయం ప్రస్తావనకు వచ్చింది. అవిశ్వాసం పెట్టి తన నియోజకవర్గంలో టీడీపీ కార్పొరేటర్‌కు అవకాశం ఇవ్వాలని ఒక ఎమ్మెల్యే కోరారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీలో పూర్తి పట్టు ఉన్నప్పటికీ రెండో డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం ఎందుకు పెట్టలేదని నేతలను ప్రశ్నించారు. దీనిపై ఓ ఎమ్మెల్యే మాట్లాడుతూ కౌన్సిల్ పదవీకాలం కొద్దినెలలు మాత్రమే ఉందని, ఇటువంటప్పుడు అవిశ్వాసం ఎందుకని అనడంతో

... మిగతా 6వ పేజీలో

ఆర్టీసీ బస్సు దగ్ధం



కూర్మన్నపాలెం నుంచి విజయనగరం వెళుతున్న మెట్రో ఎక్స్‌ప్రెస్ (నంబర్ 111) శుక్రవారం జాతీయర రహదారిపై శాంతిపురం జంక్షన్ వద్ద దగ్ధమైంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూటే ప్రమాదానికి కారణమని మంత్రి రాంప్రసాదరెడ్డి ప్రకటించారు. - మెయిన్‌లో

కబడ్డీ...కబడ్డీ

ప్రారంభ మ్యాచ్‌లో తలపడిన తెలుగు టైటాన్స్, తమిళ తలైవాస్



ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-12 శుక్రవారం నగరంలోని పోర్టు రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైంది. తొలి మ్యాచ్‌లో తమిళ తలైవాస్ 38-35 స్కోరుతో తెలుగు టైటాన్స్‌పై గెలుపొందింది. సీజన్-12 ప్రారంభానికి అంతర్జాతీయ క్రీడాకారులు ధనరాజ్ పిళ్లై (హాకీ), గోపీచంద్ (బ్యాడ్మింటన్), ఎర్రాజి జ్యోతి (అథ్లెటిక్స్), ఐపీఎల్ స్టార్ వైభవ్ సూర్యావంశి హాజరుకాగా....ప్రత్యేక అతిథులుగా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ప్రముఖ సినిమా డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు హాజరయ్యారు. - మెయిన్‌లో

6న అనంత పద్మనాభుని జయంత్యుత్సవం

పద్మనాభం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని జయంత్యుత్సవం వచ్చేనెల 6న నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈఓ నానాజీబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక కుంతీమాధవస్వామి ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్రతాలు చేసుకునే భక్తులకు కుంతీమాధవస్వామి ఆలయంలో ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.


విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న మంత్రి లోకేశ్


లోకేశ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ సభ్యులు, పక్కన ఎమ్మెల్యే గంటా

విద్యతోనే భవిష్యత్తు

- విద్యాభివృద్ధికి మొదటి ప్రాధాన్యం
- రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్

కొమ్మాది, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే భవిష్యత్తు అన్న విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకుని బాగా చదువుకోవాలని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ సూచించారు. శుక్రవారం ఆయన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఐకి భవిష్యత్తు ఉందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.అనంతరం విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టులను పరిశీలించి, వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి బాలికలు అరుణశ్రీ, భాగ్యలక్ష్మి రూపొందించిన స్మార్ట్ పార్కింగ్ ప్రాజెక్టును చూసి అభినందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఐటీ సంస్థ సైయంట్ ఫౌండేషన్ సహకారంతో జిల్లాలో రూ.8 కోట్లతో 50 ఉన్నత పాఠశాలల్లో ఏఐ ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. గతంలో ఇన్ఫోటెక్ కంపెనీయే నేటి సైయంట్ కంపెనీగా రూపాంతరం చెందిందన్నారు.ఈ కంపెనీని మోహనరెడ్డి 1991లో ప్రారంభించారని, ప్రస్తుతం అందులో 16 వేల మందికి ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. కేవలం మన దేశంలోనే కాకుండా 22 దేశాల్లో ఈకంపెనీకి బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఏఐ ద్వారా మనం ఎదుర్కొంటున్న ఏ సమస్యకైనా పరిష్కారం దొరుకుతుందన్నారు. ఉపాధ్యాయుల సహకారం వల్లే విద్యాశాఖలో పలు సంస్కరణలు తీసుకువచ్చామని, వారికి బోధనేతర పనులు తగ్గిస్తామని వెల్లడించారు. పిల్లలకు ఇచ్చే స్కూల్ కిట్‌లలో ఎక్కడా రాజకీయ నాయకుల ఫొటోలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సైయంట్ లిమిటెడ్ ఫౌండర్ బీవీ మోహనరెడ్డి, మంత్రులు కొండపల్లి శ్రీనివాసరావు, డోలా శ్రీబాల వీరాంజనేయులు, వంగలపూడి అనిత, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌కు భూమి కేటాయిస్తాం

భీమునిపట్నం : వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌కు భూమి కేటాయిస్తామని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. శుక్రవారం బీచ్‌రోడ్‌లోని రాడిసన్ బ్లూలో ఆయన్ను వీఎఫ్ఎన్‌సీపీ ప్రతినిధులు ఎమ్మెల్యే గంటా ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా వీఎఫ్ఎన్‌సీపీ ప్రతినిధులు మాట్లాడుతూ సినీ పరిశ్రమ విశాఖ రావాలన్న ప్రధాన ఉద్దేశంతోనే 2015లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారని తెలిపారు. అప్పట్లో తిమ్మాపురంలో రామానాయుడు స్టూడియో వద్ద ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని లీజు పద్ధతిలో ఏడాదికి రూ. 10 లక్షలకు కేటాయించారని గుర్తు చేశారు. జీవోలో లీజు గడువును ఎక్కడా ప్రస్తావించకపోవడంతో సాంకేతిక సమస్య వచ్చిందన్నారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ ఇప్పటికే ఈ విషయమై ఎమ్మెల్యే గంటా తనతో మాట్లాడారని, లీజు గడువును నిర్దేశిస్తూ ఐదు ఎకరాల భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడు చంద్రమౌళి ప్రసాద్, కోశాధికారి బాలాజీ, శ్రీహరి, హరివర్మ, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం (రూరల్) : మండలంలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏఐ ల్యాబ్‌ను పాఠశాల హెచ్‌ఎం దంతంశెట్టి సత్యారావు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రేఖ అప్పారావు, పీడీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో 'పొలంబడి'

పద్మనాభం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రైతులు వరి పంటలో నానో యూరియా వినియోగించడం వల్ల మెరుగైన ఫలితాలు పొందవచ్చని భీమిలి డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ బి. విజయప్రసాద్ చెప్పారు. శుక్రవారం ఆయన కృష్ణాపురంలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో మాట్లాడారు. నానో యూరియా వినియోగం, ప్రయోజనాలపై వివరించారు. పొలం బడి కార్యక్రమం 14 వారాల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ చలం, ఏఈఓ స్వాతి, వీపీఏ దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ఎండాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్య సంరక్షణకు అమలు చేస్తున్న పథకాలు, చట్టాలను వైద్యులు విధిగా పాటించాలని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి చెప్పారు. జిమ్సర్ గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, చట్టాలు 2025 అన్న అంశంపై వైద్యులకు శుక్రవారం సదస్సు నిర్వహించారు.

ప్రజల ఆకాంక్షలను గుర్తించండి

... 5వ పేజీ తరువాయి

వర్క్‌లోనే పనిచేస్తానని, ఏదైనా చేయాలని అనుకుంటే చేస్తానని, చేయకూడదని అనుకుంటే చేయబోనని స్పష్టంచేశారు. ఈ రోజు జనసేన నుంచి 21 మంది ఎమ్మెల్యేలు గెలిచారంటే..కోట్లాది మంది జన సైనికుల వల్లనేనని అంతా గుర్తుంచుకోవాలన్నారు. వారందరికీ ఏమి కావాలో వాటి కోసం పనిచేయాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలని నాయకులకు సూచించారు.

విశాఖపట్నం ఎప్పుడూ జనసేన పార్టీకి అండగా ఉందని, ఇక్కడి ప్రజలు తాము ఉన్నామనే భరోసా ఇచ్చారని పవన్ కల్యాణ్ అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఘటనలను గుర్తు చేసుకున్నారు. జనవాణి కార్యక్రమం కోసం విశాఖపట్నం వస్తే నోవాటెల్ హోటల్‌లో పోలీసులు నిర్బంధించారని, బయటకు రానివ్వలేదని పేర్కొన్నారు. ఈ విషయం తెలిసి ఓ మహిళా అభిమాని చంటి బిడ్డను చంకలో ఎత్తుకొని వచ్చి, పార్టీకి అండగా నడిరోడ్డుపై నిలబడిందన్నారు. అదేవిధంగా అంతకుముందు 2019 ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు తొలుత విశాఖపట్నం వస్తే వేలాది మంది అభిమానంతో వచ్చి స్వాగతం పలికారన్నారు. విశాఖతో జనసేన పార్టీ బంధం విడదీయరానిదన్నారు.

కూటమితో కలిసి ఉంటూనే పార్టీ బలోపేతం

కూటమితో కలిసి ఉంటూనే సొంతంగా జనసేన బలోపేతం అవుతుందని, దానికి పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దిశా నిర్దేశం చేశారని ఆ పార్టీ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. బీచ్‌రోడ్డులోని బే వ్యూ హోటల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటు నియోజకవర్గాల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకులతో పవన్ కల్యాణ్ మాట్లాడిన అంశాలను సుందరపు వెల్లడించారు. ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారం అయ్యేలా నాయకత్వం అభివృద్ధి చెందాలని సూచించారన్నారు. రుషికొండ ప్యాలెస్‌పై త్వరగా ఒక నిర్ణయం తీసుకోవాలని సమావేశంలో తీర్మానం చేశామని, దానిని సీఎం చంద్రబాబునాయుడుకు అందజేస్తామన్నారు. రుషికొండ పెద్ద అంశం కాదని వైసీపీ నేతలు అంటున్నారంటే..వారికి ప్రజాధనం రూ.453 కోట్లు అంటే లెక్కలేదని అర్థం చేసుకోవాలన్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం జరిగేది బహిరంగ సభ కాదని, పార్టీ క్రియాశీల కార్యకర్తల సమావేశం అని, రాత్రి 7.30 గంటల వరకు జరుగుతుందన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల వారు కూడా వస్తున్నారన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు తోట నగేశ్ పాల్గొన్నారు.


ధ్యాన్‌చంద్, గిడుగు రామమూర్తి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు


బోయపాలెంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

భీమునిపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మన వారసత్వానికి, ఆత్మ గౌరవానికి తెలుగు భాష పునాదిగా నిలుస్తుందని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ అన్నారు. శుక్రవారం కళాశాలలో జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ తెలుగుపై ఇష్టం పెంచుకొని, విద్యార్థుల్లోనూ ఆ అభిమానాన్ని పెంపొందించాలని కోరారు. అనంతరం గిడుగు రామ మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఛాత్రోపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామమూర్తి చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డి. ప్రవీణ, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆనందపురంలో...

ఆనందపురం : మండలంలోని బోయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్. లక్ష్మి మాట్లాడుతూ మన ప్రాచీన వారసత్వానికి ఊపిరి పోసే భాష తెలుగు అన్నారు. 1996 ఆగస్టు 29న అప్పటి ప్రభుత్వం తెలుగు భాషా దినోత్సవంగా ప్రకటించిందన్నారు.అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

భీమునిపట్నం (రూరల్) : తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణ, గంగరాజు, లలిత, దీన లత, చంద్రమౌళి, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు


కప్ప స్తంభం వద్ద ప్రభుత్వ సలహాదారుడు సతీశ్‌రెడ్డి

సింహాచలం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారు డా. జి. సతీశ్‌రెడ్డి, టీటీడీ పాలక మండలి సభ్యుడు బి. ఆనందసాయి, భీమవరం ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు శుక్రవారం దర్శించుకున్నారు. వారికి దేవాలయ ఏఈఓ కె. తిరుమలేశ్వరరావు అధికార మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అర్చకులు అంతరాలయంలో పూజలు చేసి శేష వస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

సంప్రదాయబద్ధంగా స్వాతి నక్షత్ర హవనం

సింహాచలం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై స్వాతి నక్షత్ర హవనం శుక్రవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. యజ్ఞమూర్తిగా సుదర్శన పెరుమాళ్‌ను ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు.పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో మండపారాధన, కలశారాధన, బింబారాధన జరిపారు.భక్తుల గోత్రనామాలతో సంకల్పించి షోడశోపచరాల పూజలు చేసి, నారసింహ అష్టోత్తర శతనామార్చన జరిపారు. తరువాత ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో రుత్విక్‌లు పంచ సూక్తాలతో, నారసింహ, సుదర్శనమూర్తి, మూల మంత్రాలతో హవనాన్ని నిర్వహించారు. తరువాత మూల కలశాన్ని శిరస్సున దాల్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి స్వామి చెంత ఉంచి పూజలు చేశారు. పవిత్ర జలాలతో భక్తులను ప్రోక్షణ కావించారు. స్వామివారికి కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వ హించారు.


హవనం చేస్తున్న రుత్విక్‌లు

డీఎల్‌డీఓ భవన నిర్మాణం పరిశీలన

భీమునిపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న డీఎల్‌డీఓ భవనాన్ని పరిశీలించారు. పంచాయతీరాజ్ శాఖకు చెందిన డివిజనల్ అధికారుల తాత్కాలిక ఛాంబర్లను ఈ భవనంలో ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

ఆగమ పాఠశాలలో గణపతి నవరాత్రి ఉత్సవాలు

సింహాచలం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆగమ పాఠశాలలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. శ్రీకాంతాచార్యులు పర్యవేక్షణలో ఈ ఉత్స వాలు కొనసాగుతున్నాయి.

'చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే'


చిట్టివలస బాలుర పాఠశాలలో స్పోర్ట్స్ డే ఆకృతిలో విద్యార్థులు

ఆనందపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టిసారించాలని ఎన్ఎస్ఆర్ ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. శంభు ప్రసాద్ అన్నారు. శుక్రవారం శొంఠ్యాం సమీపంలో ఉన్న ఎన్ఎస్ఆర్ ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు.

తగరపువలస : చిట్టివలస బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం ఆదినారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు స్పోర్ట్స్ డే ఆకృతిలో ఏర్పడ్డారు. కార్యక్రమంలో పీడీలు వి. అచ్యుతరావు, అప్పలరాజు, ఉపాధ్యాయులు ఈశ్వరవర్మ, దుర్గాప్రసాద్, శారద పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతృ భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవం నిర్వహించారు.


కార్మికులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

సింహాచలం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మారుమూల గ్రామీణ ప్రజలకు కూడా ఏసీ బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్టు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, ఆర్ఓ ప్లాంటును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్టుగా బస్సుల సంఖ్య పెంచాల్సి ఉందన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని త్వరలో నియమిస్తామని, వీటిలో కారుణ్య నియామకాలకు తొలి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. అనంతరం జిల్లాలో విధి నిర్వహణలో ప్రతిభ చూపిన పలువురు కార్మికులకు మంత్రి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ విజయనగరం జోన్ ఈడీ బ్రహ్మానందరెడ్డి, డీపీటీఓ ఆర్. అప్పలనాయుడు, సింహాచలం డిపో మేనేజర్ ఎస్. శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

పద్మనాభం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలందించాలని మండల ప్రత్యేకాధికారి కె. జ్ఞానవేణి ఆదేశించారు. మండలంలోని రేవిడి పీహెచ్‌సీని, పద్మనాభంలోని బీసీ బాలుర వసతి గృహం, అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. తొలుత అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అనంతరం రేవిడి పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న సేవలను వైద్యాధికారి లీలా ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే బీసీ వసతి గృహంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. తరువాత మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు.

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దు : సీపీఎం

కొమ్మాది, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమర్చి, ప్రజలను మోసం చేయొద్దని సీపీఎం నాయకుడు అప్పలరాజు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన 5వ వార్డు పరదేశిపాలెం కొండవాలు ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలన్నారు.

సకాలంలో స్థానిక ఎన్నికలు

... 5వ పేజీ తరువాయి

మంత్రి లోకేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారని తెలిసింది. ఆ సమయంలోనే స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి చెప్పారు. ప్రభుత్వంలో ఇంకా మిగిలిన నామినేటెడ్ పదవులు పంపకం త్వరలో చేపడతామన్నారు. జీవీఎంసీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి లోకేశ్ పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిన తరువాత ఇన్‌చార్జి మంత్రి నేతృత్వంలో సర్క్యూట్‌హౌస్‌లో ఎంపీ భరత్ తప్ప మిగిలిన వారంతా సమావేశమయ్యారు. రెండో డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం, నామినేటెడ్ పదవుల పంపకం కోసం నివేదికలు తయారుచేయడం, నగరంలో ఇంటింటికీ 24 గంటల తాగునీరు, రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణం, ఇతర పనులు వెంటనే పూర్తిచేసేలా జీవీఎంసీ అధికారులకు సూచించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నగర మేయర్‌కు పలు సూచనలు చేశారు.

మంత్రి లోకేశ్ ప్రజా దర్బార్


సమస్యలపై వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఉదయం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురు ఇచ్చిన వినతులు పరిశీలించి ఆయా సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్రలో వాడబలిజ మత్స్యకారులకు వలలు, బోట్లు ఇవ్వాలని, శిక్షణ కేంద్రాలు, పాఠశాలలు ఏర్పాటుచేయాలని సంబంధిత సంఘం ప్రతినిధులు కోరారు. రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన తనకు ఉపాధి కల్పించాలని మింది ప్రాంతానికి చెందిన దాడి అవినాశ్, వినాయక ఉత్సవాల ఊరేగింపులో సౌండ్ సిస్టమ్‌ను అనుమతించాలని ఈవెంట్ మేనేజర్ల సంఘం ప్రతినిధులు కోరారు. రోడ్డు ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన తనను ఆర్థికంగా ఆదుకోవాలని ఎలమంచిలికి చెందిన గుడాల జీవన్‌కుమార్, డిగ్రీ చదివిన దివ్యాంగురాలైన తన కుమార్తెకు ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని 91వ వార్డుకు చెందిన ఆదినారాయణ కోరారు.

నంబర్ వన్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

కలుపుతుంది కాబట్టి పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. భవిష్యత్తులో విశాఖ టెక్నాలజీ హబ్‌గా తయారుకాబోతోందని, ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి ఎంతోమంది నగరానికి వలసవచ్చే పరిస్థితి ఉంటుందని చంద్రబాబునాయుడు అన్నారు. విశాఖను రాజధాని చేస్తామని గత ప్రభుత్వం ప్రకటిస్తే...అవసరం లేదని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయాలంటూ నగరవాసులు తమ తీర్పును గత ఎన్నికల్లో ఇచ్చారని చంద్రబాబు అన్నారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో చాలాచోట్ల టీడీపీ ఓటమి పాలైనాసరే విశాఖ నగరంలోని అన్ని స్థానాల్లోనూ పార్టీ అభ్యర్థులను గెలిపించారన్నారు. అది పార్టీపై, తనపై నగరవాసులకు ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని సీఎం చంద్రబాబు వివరించారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

... 5వ పేజీ తరువాయి

రాకపోకలు సాగించే పాసింజర్ రైళ్లను (58503/58504) విశాఖ-పార్వతీపురం టౌన్ మధ్య నడిపారు. భువనేశ్వర్-ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), పూరి-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (22883) రైళ్లు నిర్ణీత సమయం కంటే నాలుగు గంటలు ఆలస్యంగా బయలుదేరేలా రీ షెడ్యూల్ చేశారు. సమాచారం తెలుసుకున్న డీఆర్‌ఎం లలిత్ బొహ్రా, ఇతర అధికారులు హుటాహుటిన విశాఖపట్నం నుంచి ఘటనా స్థలానికి చేరుకున్నారు. డీఆర్‌ఎం పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు.

నగరంలో సందడే సందడి

... 5వ పేజీ తరువాయి

వెళ్లి ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సదస్సులో పాల్గొన్నారు. ఆ తరువాత రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళ్లి గ్రిప్పింగ్ నెట్‌వర్క్ సదస్సులో పాల్గొన్నారు. సాయంత్రం బయలుదేరి కుప్పం వెళ్లారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనడానికి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాల వీరాంజనేయస్వామి, హోం శాఖ మంత్రి అనిత, కొండపల్లి శ్రీనివాస్, తదితరులు నగరానికి వచ్చారు. ఇలా నగరం ఉదయం నుంచి సాయంత్రం వరకు కళకళలాడింది.

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే వెలగపూడి



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : విశాఖ పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కోస్టల్ బ్యాటరీ హెలిపాడ్ వద్ద చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే కలుసుకొని పుష్పాన్ని అందించారు.

వినాయక మండపాల్లో విద్యుత్ భద్రతా జాగ్రత్తలు తప్పనిసరి

- ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ జి.శ్యాంబాబు



విశాఖపట్నం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ జి.శ్యాంబాబు సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనల విడుదల చేశారు. మండపాలకు తాత్కాలిక విద్యుత్తు సరఫరా కోసం అధికారిక కనెక్షన్లు తీసుకోవాలని, అనధికారికంగా విద్యుత్తు వాడితే ప్రమాదకరమని, చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. లైసెన్సు ఉన్న ఎలక్ట్రీషియన్‌తోనే ఎలక్ట్రికల్ పనులు చేయించాలని, తగిన సామర్థ్యం ఉన్న ఫ్యూజ్‌ను వాడాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ బోర్డు వినియోగించి అందులో ఎర్త్ లీకేజీ సర్క్యూట్స్ తప్పనిసరిగా వాడాలని పేర్కొన్నారు. ఐఎస్ఐ ప్రమాణాలు ఉన్న వైర్లు మాత్రమే వాడాలని, ప్రతి మండపానికి ప్రత్యేక ఎర్తింగ్ ఉండాలని మల్టీ ప్లగ్, ఓవర్ లోడింగ్ నివారించాలని సూచించారు. విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్లకు, విద్యుత్తు లైన్లకు కనీస దూరంలో మండపాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. లైటింగ్ కోసం ఎల్ఈడీ బల్బులు వాడాలని, సీరియల్ సెట్ వాడేటప్పుడు వాటిని లోహ వస్తువులకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



మద్దిలపాలెం : తెలుగు భాషా పరిరక్షణ కోరుతూ నినాదాలు చేస్తున్న తెలుగుదండు ప్రతినిధులు



ఏయూలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్, పాల్గొన్న ఆచార్యులు

తెలుగు పరిరక్షణకు చర్యలు అవసరం

» తెలుగుదండు అధ్యక్షుడు చిన్నయసూరి » పలుచోట్ల ఘనంగా తెలుగు భాషా దినోత్సవం » గిడుగు రామమూర్తికి నివాళి

మద్దిలపాలెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచమంతా తెలుగు భాష గౌరవింపబడుతుండగా, రాష్ట్రంలోమాత్రం నిర్లక్ష్యానికి గురవుతుండడం బాధాకరమని, ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరిచి తెలుగు భాష పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలుగుదండు అధ్యక్షుడు చిన్నయ్యసూరి పేర్కొన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి పురస్కరించుకొని మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సూరి మాట్లాడుతూ ఉర్దూను సైతం అధికార భాషగా గుర్తించిన ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు భాషను పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. భాషా పరిరక్షణను బాధ్యతగా భావించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం తమ బాధ్యతలను విస్మరిస్తోందని విమర్శించారు. అందుకే త్వరలో తెలుగు భాషాభిమానులతో కలిసి గాంధేయ మార్గంలో నిరసనలు చేపడతామని తెలిపారు. అనంతరం భావి తరాలకు తెలుగు భాషను అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో భాషాభిమానులు చిన్న సూర్యానారాయణ, సత్యనారాయణ, శ్రీనుబాబు, హేమ, శ్రీధర్, రాజమన్నార్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో..

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సమాజాన్ని మేల్కొల్పిన మహావ్యక్తి గిడుగు వెంకటరామమ్మూర్తి పంతులు అని ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్ అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏయూ తెలుగుశాఖ, సమైక్య భారతి నిర్వహించిన తెలుగుభాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. తన రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన భాషా వైతాళికుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు అని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలుగు శాఖాధిపతి జర్రా అప్పారావు మాట్లాడుతూ తెలుగు వ్యవహారిక భాషాభివృద్ధికి, విస్తరణకు గిడుగు ఎంతగానో కృషి చేశారన్నారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.నరసింహారావు, ఆచార్య వెలమల సిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వ్యాలీలో..

ఆరిలోవ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు 162 వ జయంతి సందర్భంగా విశాఖ వ్యాలీ స్కూలులో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్ ఆమె మాట్లాడుతూ తెలుగు భాష ఎంతో అంధుల కోసం శాస్త్రీయసంగీత పుస్తకాన్ని బ్రెయిలీ లిపిలో రాసి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సాధించిన కొల్లూరు లక్ష్మీకాంతంను ఘనంగా సన్మానించారు. అలాగే అవధాని కట్టమూరు చంద్రశేఖర్, విజయనగరం జిల్లా నెలిమర్ల కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్‌ను సన్మానించారు. సాహిత్యం సంస్కృతి సాహిత్య పోటీలో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కుచేలోపాఖ్యానం, అవధాన, జానపద, కవితా వివాదాలు, సుమధుర కమ్మని తేనె లొలికే తెలుగు గానామృతాలను విద్యార్థులు వినిపించారు. 1వ తరగతి చిన్నారి ఎ.ఎర్లీన్ డెబోరా పలికిన తెలుగు ముద్దు పలుకులు కవితకు అంతా కరతాళ ధ్వనులతో అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థుల తలితండ్రులు, స్కూలు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వెండి వినాయకుడు

» 2 వేల కిలోల జర్మన్ సిల్వర్‌తో తయారీ » దర్శనానికి పోటెత్తిన భక్తులు



బీచ్‌రోడ్డు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బీచ్‌రోడ్డులోని ఏపీఐసీసీ మైదానంలో ఏర్పాటు చేసిన జర్మన్ సిల్వర్ గణపతి విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది. సుమారు 2 వేల కిలోల జర్మన్ సిల్వర్ తో రూపొందించిన ఈ విగ్రహాన్ని చూసేందుకు నగరనలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. భక్తులకు ఉచిత ప్రవేశం కల్పించడంతో పెద్ద సంఖ్యలో తిలకించడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రాంగణం చుట్టూ ఆకుపచ్చని మొక్కలతో సుందరంగా అలంకరించారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనానికి అవకాశం కల్పిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

» ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

వెంకోజీపాలెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి, విశాఖ జిల్లా కేంద్రాల నుంచి అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుకు చేరుకోవడం ప్రధాన సమస్యగా మారిందని, రోడ్లన్నీ గోతులమయంగా మారాయని, విశాఖ జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మాత్యులు కె.పవన్‌కల్యాణ్‌కు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ శుక్రవారం విన్నవించుకున్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు స్వయంగా ప్రస్తుత డీసీఎం రోడ్ల రిపేర్‌ల గురించి ఆందోళన చేసిన సంఘటనలను అజశర్మ ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2025, సంక్రాంతి పండుగలోగా మొత్తం గుంతలు లేని రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారని, ఆ పండుగ వెళ్లిపోయిందని, మళ్లీ 2026 సంక్రాంతి పండుగ కూడా సమీపిస్తోందని, కానీ రోడ్ల మరమ్మతులు మాత్రం జరగలేదని ఎద్దేవా చేశారు. రిపేర్లు జరగకపోగా, మరిన్ని గోతులు పెరిగాయన్నారు. చోడవరం, వడ్డాది మధ్య ఒక వంతెన నిర్మాణం సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉందని, దాన్ని పక్కనే ఉన్నతాత్కాలిక డైవర్షన్ మార్గం కూడా పలు సందర్భాల్లో మూతపడుతోందన్నారు. దీంతో ప్రయాణ సమయం పెరగడమే కాకుండా వాహనాలు కూడా పాడవుతున్నాయని, ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని డీసీఎంకు తెలిపారు. ఒక్కసారి ప్రత్యక్షంగా డీసీఎం అనకాపల్లి నుంచి మాడుగుల వరకు కానీ లేదా విశాఖ నుంచి మాడుగుల వరకు గానీ రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించి చూస్తే రోడ్ల దుస్థితి అర్థమౌతుందన్నారు. వెంటనే సమస్య పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 6 వినతులు

వెంకోజీపాలెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 6 వినతులు వచ్చినట్టు చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు సీసీపీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 38, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 32, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 28, బీరకాయలు 40, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 46, బంగాళ దుంపలు 18, అరటి కాయ (పె)10, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది) 74, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 80, కీర దోస 30, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 44, కంద 40,దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	108
లైవ్ ధర	128
విత్ స్కిన్	226
స్కిన్‌లెస్	236

విద్యార్థులు మొక్కలు నాటడం అలవాటుగా చేసుకోవాలి

» సీఆర్పీఎఫ్ కమాండెంట్ పి.కిశోర్

మద్దిలపాలెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మొక్కలు నాటడం అలవాటు చేసుకుని తద్వారా పర్యవరణ పరరక్షకులుగా నిలవాలని సీర్పీఎఫ్ కమాండెంట్ పి.కిశోర్ సూచించారు. మద్దిలపాలెంలోని వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ పచ్చదనం పర్యావరణ హితమన్నారు. కాంక్రీట్ జంగిల్ మారుతున్న నగరాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని తీసుకుని రావాలన్నారు. పచ్చదనం-పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహనతో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత, ఎన్‌సీసీఅధికారి సన్యాసిరావు, అధ్యాపకులు వేదవ్యాస్, ఆర్వీ నాయుడు, సుష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సస్పెండైన జైళ్ల శాఖ అధికారులపై దర్యాప్తునకు బృందం రాక నేడు

ఆరిలోవ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : విశాఖ కేంద్ర కారాగారంలో గతంలో పని చేసి, సస్పెండ్‌కు గురైన సూపరింటెండెంట్ కిషోర్ కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ వేంకటేశ్వరరావుపై దర్యాప్తు నిర్వహించేందుకు శనివారం ఒక బృందం ఇక్కడకు వస్తున్నట్టు విశాఖ కేంద్ర కారాగార డిప్యూటి సూపరింటెండెంట్ సాయిప్రవీణ్ తెలిపారు. జైళ్ళ శాఖ గుంటూరు రేంజ్ డీఐజీ వరప్రసాద్, కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వరరావు ఈ దర్యాప్తు బృందంలో ఉన్నట్టు తెలిపారు. గతంలో ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేసిన కిషోర్‌కుమార్, అడిషనల్ సూపరిండింట్‌గా పనిచేసిన వెంకటేశ్వరరావు ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు. దర్యాప్తు అనంతరం నివేదికను జైళ్ల శాఖ ఉన్నతాదికారులకు సమర్పించనున్నట్టు సాయిప్రవీణ్ తెలిపారు.

మేజర్ ధ్యాన్‌చంద్ సేవలు నిరుపమానం

» ఏయూ వీసీ రాజశేఖర్



ధ్యాన్‌చంద్‌కు నివాళులు అర్పిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, ఏయూ అధికారులు, పలువులు ఆచార్యులు, విద్యార్థులు

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఒలింపిక్స్ పురుషుల హాకీలో భారతదేశానికి గోల్డ్ మెడల్స్ ఎక్కువగా తెచ్చిన ఘనత మేజర్ ధ్యాన్‌చంద్‌కే దక్కుతుందని ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఏయూ వ్యాయామ విభాగం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా మొట్టమొదటిగా ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ఏయూలో ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. జాతీయ స్థాయిలో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న వ్యాయామ విద్యా విభాగం డైరెక్టర్ ఎన్.విజయమోహన్‌ను ఈ సందర్భంగా అభినందించారు. ఆచార్య ఎన్.విజయమోహన్ మాట్లాడుతూ ఏ కార్యక్రమం చేసినా అది విజయవంతం అయ్యేందుకు ఏయూ అధికారుల సహకారమే కారణమన్నారు.

కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఎన్.కిశోర్‌బాబు, ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, సైన్సు కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ భవనాలపై కూటమి పార్టీలది దుష్ప్రచారం

» వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



మద్దిలపాలెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ భవనాలపై కూటమి పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు విమర్శించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ రుషికొండ సందర్శించి నిర్మాణాలపై కామెంట్ చేయడం సరికాదన్నారు. గతంలో టూరిజం రిసార్ట్ ఉన్నప్పుడు అక్కడ రెండు బార్లు ఉండేవన్నారు. రుషులు నివసించే స్థలంగా చెప్పుకునే రుషికొండపై బార్లు నిర్వహించడమే కాకుండా అసాంఘిక కార్యకలపాలు కూడా జరిగేవని ఆరోపించారు. అక్కడ వైసీపీ ప్రభుత్వ హయంలో ప్రభుత్వ భవనాలు నిర్మాణం చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్, జనసేన ఎమ్మెల్యేలు రుషికొండ నిర్మాణాలను విమర్శిస్తూనే, ఆ భవనాలను హైకాన్ బిల్డింగ్‌లా వినియోగించుకుంటే మంచిదని తీర్మాణం చేయడం నిర్మాణాల గొప్పతనానికి నిదర్శనమన్నారు. పవన్‌కల్యాణ్ రుషికొండపై భవనాలు పెచ్చులూడు పోతున్నాయి, నాణ్యత లేదనడాన్ని కేకే రాజు తప్పుబట్టారు. అమరావతిలో తాత్కాలిక రాజధాని కట్టడాలకు చేసిన ఖర్చు కంటే రుషికొండపై చేసిని నిర్మాణాలకు తక్కువే ఖర్చు అయిందని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంటుపై పవన్‌కల్యాణ్ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కూటమి ఎంపీలపై బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఆధారపడి ఉన్నా స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరణను ఆపలేకపోతున్నారని కేకే రాజు విమర్శించారు.

నేడు రాష్ట్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష



సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఆశీల్‌మెట్ట వద్ద గల గాంధీ విగ్రహం ఎదుట రిలే నిరాహార దీక్ష నిర్వహించన్నుట్టు సంఘం ఉత్తరాంధ్ర కన్వీనర్ గొర్లె శ్రీనివాసనాయుడు తెలిపారు. ఎంవీపీ కాలనీలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళల కోటాను సబ్ డివిజన్ చేయాలని డిమాండ్‌తో ఈ దీక్షలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ ఆధ్వర్యంలో ఒక రోజు రిలే నిరాహార దీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇళ్ల వేంకటేశ్వరరావు, జిల్లా సంఘం అధ్యక్షులు పల్ల రమణ యాదవ్, మహిళా నాయకులు గాయత్రి, దీప్తి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నాగాసన గణపతిగా సంపత్ వినాయగర్ స్వామి దర్శనం



నాగాసన గణపతిగా పూజలు అందుకుంటున్న సంపత్ వినాయగర్ స్వామి

సిరిపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయంలోని వినాయక చవితి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శుక్రవారం స్వామివారు శ్రీనాగాసన గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున 4 గంటల నుంచే భక్తులకు స్వామివారి దర్శనం ప్రారంభమైంది. గణపతి హోమం, నాదస్వరం, ఉభయదాతలతో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. ఆలయ ఆవరణలోని భక్తులకు ప్రసాద వితరణ చేపట్టినట్టు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలియజేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని శ్రీకందుకూరి వేంకట సత్యబాల సుబ్రహ్మణ్యశర్మ శ్రీగురుగీతపై ప్రవచనం గావించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి పర్యవేక్షించారు.

సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికిన మేయర్



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిరప్రసాద్

వెంకోజీపాలెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నగరానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు శుక్రవారం కోస్టల్ బ్యాటరీ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌తో కలిసి మేయర్ పుష్పాలను అందించి స్వాగతం పలికారు.

సామాజిక సంస్కర్త శారదకు ఘన నివాళి



నాస్తిక మహిళా శక్తి శారదమ్మకు నివాళులు అర్పిస్తున్న భారతీయ నాస్తిక సమాజ ప్రతినిధులు

ఆరిలోవ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి చేసిన తొలి తరం సంస్కర్త శారదమ్మ అని జాతీయ నాస్తిక సమాజం సయన్వయకర్త జే.రవి పేర్కొన్నారు. శారద ఐదో వర్ధంతిని పురస్కరించుకొని ఆరిలోవ నాస్తిక సమాజ కార్యాలయంలో శుక్రవారం ఆమెకు సమాజం ప్రతినిధులు ఘనంగా నివాళులు అర్పించారు. భారత నాస్తిక సమాజం స్థాపనలో తన భర్త డాక్టర్ జయగోపాల్‌ని ప్రోత్సహించిన ఘనత ఆమెదని అన్నారు. ఆనాటి సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు ఆమె ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. జయగోపాల్ రచనల వెను ఆమె ఒక నిశ్శబ్ద శక్తి అని అన్నారు. 2010 వరకు మూఢనమ్మకాల నిర్మూలన, మహిళా హక్కుల కోసం అహర్నిశలూ కృషి చేసిన ధీశాలి శారద అని ప్రశంసించారు. ఆమె త్యాగం, సేవాభావం, మనోబలం ఎప్పటికీ మరచిపోలేదన్నారు.

కార్యక్రమంలో నాస్తిక సమాజ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేనప్పటికీ ఆమెకు సమాజ సమాజ సేవ చేయాలన్న తపన, దీక్ష, పట్టుదల ఉండేన్నార. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా నాయకులు బంకూరి జోగి నాయడు, ప్రముఖ విప్లవ కవి కుమార్ ఉదయ భాస్కర్ తదితరులు మాట్లాడారు.

గణనాథుడి మండపంలో దీపారాధన

వెంకోజీపాలెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారి పక్కన గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల వద్ద మహిళలు దీపారాధన చేశారు. శంఖు, చక్రం బొమ్మ గీసి దానిపై దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఆడారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీలా ప్రేమ్‌కిరణ్ జగదీష్, ఇతర కార్యవర్గ సభ్యులు, గ్రామస్తులు, కస్తూరి మహిళా మండలి, కిరణ్మయి మహిళామండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన లెక్చరర్‌కు రిమాండ్

పరవాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ గుత్తల శ్రీధర్‌కు రెండు వారాలపాటు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. లెక్చరర్ శ్రీధర్ ఈ నెల 23వ తేదీన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం విచారణ జరిపిన పోలీసులు.. లెక్చరర్ శ్రీధర్, సదరు విద్యార్థినిని ల్యాబ్‌కు పిలిపించి లైంగిక వేధింపులకు పాల్పడిన ట్టు తేలింది.శ్రీధర్‌ను శుక్రవారం అనకాపల్లి కోర్టులో హాజరుపరచగా వచ్చే నెల 12 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తిఆదేశాలు జారీ చేసినట్టు సీఐమల్లికార్జునరావు తెలిపారు.

31న పనిచేయనున్న విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు

సీతమ్మధార, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ రెవెన్యూ కార్యాలయాలలో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు ఈ నెల 31న పనిచేస్తాయని సంస్థ సూపరింటెండింగ్ ఇంజనీర్ జి.శ్యాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ బిల్లులను విద్యుత్, ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, రాజీవ్ ఈపీడీసీఎల్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలో చెల్లించవచ్చన్నారు. ఏపీఈపీడీసీఎల్ వైబ్‌సైట్లు, ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్ ద్వారానూ వినియోగదారులు బిల్లులను సకాలంలో చెల్లించవచ్చన్నారు.


ఏటా డీఎస్సీ ప్రకటనపై హర్షాతిరేకాలు


అక్కయ్యపాలెం/సీతమ్మధార, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఏటా మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించడం, 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాల మెరిట్ లిస్టు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ కిరీటం బహూకరించారు. విశాఖ నగర పర్యటనకు వచ్చిన మంత్రి లోకేశ్‌ను శుక్రవారం కలిసి తమ సంతోషాన్ని వ్యక్తంచేశారు. వచ్చే ఎన్నికల నాటికి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తారన్న నమ్మకం కలుగుతోందన్నారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియ పూర్తయిన తరువాత, కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఏడేళ్ల తరువాత మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాలు చేపట్టిన హీరోలు చంద్రబాబు, నారా లోకేశ్ అంటూ వారి చిత్రపటాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జి.గణేష్, జుంజూరు గోవింద్, వాసుపల్లి రాంబాబు, రూప, రజిని, వీరబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.



మంత్రి నారా లోకేశ్‌ను కలిసి అభినందిస్తున్న నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు











ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సీతమ్మధార, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఏయూ తెలుగు శాఖ, సమైక్య భారతి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అప్పారావు మాట్లాడుతూ భాష ద్వారా సమాజాన్ని మేల్కొల్పిన మహానుభావుడు గురజాడ అప్పారావు అయితే, సమాజాన్ని జాగృతి చేసిన భాషా వైతాళికుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులని కొనియాడారు. వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ తాను స్వయంగా రాసిన 'తెలుగు తల్లి.. మన వెలుగు తల్లి' కవితను చదివి వినిపించారు. ఆర్ట్స్, కామర్స్ ప్రొఫెసర్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని డిజిటలీకరించాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వెలమల సిమ్మన్న, కొమ్రాజు రవి, గజ్జా యోహాన్ బాబు, ప్రేమానందం, ధన్‌రాజ్, కన్నయ్య మురళి, కిశోర్, కృష్ణప్రసాద్, జంధ్యాల శరత్‌బాబు, భానుమూర్తి, మువ్వల రాంబాబు, గణేశ్, వేణుగోపాలరావు, సన్నిధి విశ్వనాథరావు తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం : కంచరపాలెంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పలువురు గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాష ఉన్నతికి ఆయన చేసిన కృషిని కొనియాడారు.

జ్ఞానాపురం: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. తెలుగు విభాగాధిపతి జయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు భాష పుట్టుక, అభివృద్ధిని వివరించారు. అనంతరం క్విజ్, వ్యాసరచన, పద్యపఠన పోటీలు నిర్వహించి, విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అక్కయ్యపాలెం : అక్కయ్యపాలెం ఎన్‌జీఓస్ కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జయంతి రాజకుమారి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు ఎంఎన్‌వీ విశ్వనాథం, సీహెచ్‌వీఎస్ కిరణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, పద్య పఠన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవీశ్రీ ప్రసాదరావు తెలుగు భాష గొప్పతనాన్ని గేయ పద్య రూపంలో వివరించారు.

లక్ష్మీగణపతి అలంకరణలో దుర్గాగణపతి

సీతంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కార్యనిర్వహణాధికారి రమాభాయి, ఉత్సవ కమిటీ చైర్మన్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌ల పర్యవేక్షణలో వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం దుర్గాగణపతిని లక్ష్మీ గణపతిగా అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు విచ్చేసి వినాయకుడిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు నటరాజన్ బృందం హోమాలు, అభిషేకాలు జరిపారు. ఇక్కడ తొమ్మిది రోజులూ రోజుకో అలంకరణలో వినాయకుడిని అలంకరించాలని కమిటీ నిర్ణయించిన సంగతి తెలిసిందే. చివరి రోజున మహా అన్నదానం నిర్వహిస్తారు.





ఆంధ్రజ్యోతి కార్యాలయం సమీపంలోని ఆలయంలో లక్ష్మీగణపతిగా అలంకరణ -ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

వరప్రసాద్‌కు సత్యసాయి భజనమండలి సత్కారం



వరప్రసాద్‌కు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

మురళీనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ సత్యసాయి సేవా భజన మండలి సభ్యులు శుక్రవారం టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్‌ను సత్కరించారు. 50వ వార్డులో ప్రజా సమస్యల పరిష్కారంపై నిరంతరం శ్రమిస్తున్నందుకు మండలి సభ్యులు అభినందిస్తు శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. పార్టీలకు అతీతంగా సేవలు అందించడం స్ఫూర్తిదాయకమని భజన మండలి సభ్యులు పేర్కొన్నారు. ఆయన ప్రజలకు మరింతగా మంచి చేయాలని ఆకాక్షించారు.

మురుగునీరు తొలగింపు

మురళీనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 51వ వార్డులో ఇటీవల జోన్-5 జెడ్సీ బి.రాము పర్యటించినప్పుడు ఆర్టీఏ కార్యాలయం దారిలో దెబ్బతిన్న కల్వర్టు దిగువ వ్యర్థాలు పేరుకుపోతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జెడ్సీ వెంటనే కల్వర్టు తెరిచి దిమ్మెలను తొలగించాలని స్థానిక కాంట్రాక్టరుకు సూచించడంతో శుక్రవారం ఆ పని చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టరు పర్యవేక్షణలో పనులు చేయించి చెత్తను తొలగించారు. ఎగువ మాధవధార ఉడాకాలనీ నుంచి వచ్చి చేరుతున్న మురుగునీటికి తోడు పక్కనే కాయగూరల దుకాణం, మహిళా వసతి గృహం నిర్వాహకులు, టిఫిన్ దుకాణాల నిర్వాహకులు వ్యర్థాలను వేస్తుండడంతో మురుగు పారడం లేదు. నివాసితుల ఇళ్ల ముందు దుర్వాసన వెదజల్లుతున్న సమస్య ఎట్టకేలకు స్థానికుల ఫిర్యాదు, జెడ్సీ బి.రాము చొరవతో పరిష్కారమైంది.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

జ్ఞానాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం రైల్వే పార్సిల్ కార్యాలయం వద్ద ఓ అనాథ వృద్ధుడు (70) మరణించడంతో అవర్‌హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పిల్లి గోవిందరాజు, శ్యామ్‌సుందర్‌రెడ్డి, కిలాడి జీవన్ కుమార్‌లు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. పిల్లి గోవింద రాజుకు చెందిన అంబులెన్స్‌లో మృతదేహాన్ని కాన్వెంట్ జంక్షన్‌లోని శ్మశానవాటికకు తరలించారు. అక్కడి ఇన్‌చార్జ్ ప్రసన్న కుమార్, కంచరపాలెం పోలీసులు రాంబాబు, నారాయణల సహకారంతో అంత్యక్రియలు జరిపించారు.

మహిళా కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం



పోటీల్లో గెలిచి ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్, పీడీ తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం జరిగిన వేడుకలలో భాగంగా కళాశాలలో టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నీలో నగరంలోని ఏడు కళాశాలల నుంచి జట్లు పాల్గొన్నాయి. బుల్లయ్య కళాశాల, సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల, విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలల జట్లు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. భారత క్రీడారంగానికి ప్రపంచ వ్యాప్తంగా విశేష కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చిన మేజర్ ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థాయికి చేరేందుకు క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. కళాశాల ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, డాక్టర్ కెఎల్.శిరీషా, ఎస్.అనురాధ, డాక్టర్ నివేదిత, డాక్టర్ కె.గీతాంజలి పాల్గొన్నారు.

ఇందిరా స్టేడియం వద్ద ట్రాఫిక్ ఆంక్షలు

మహారాణిపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం జరగనున్న 'సేనతో సేనాని' ప్లీనరీ కార్యక్రమం నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధుల వాహనాలు ఆర్కే జంక్షన్ మీదుగా వచ్చి స్టేడియంలోని వీఐపీ పార్కింగ్ స్థలంలో ఉంచాలి. ద్విచక్రవాహనదారులు పోర్టు ఆర్చ్ వద్ద రహదారికి ఇరువైపులా పార్కింగ్ చేసుకుని సీ హార్స్ జంక్షన్ నుంచి స్టేడియం లోపలకు ప్రవేశించాలి. ఆటోలు, కార్లు, బస్సులలో వచ్చే వారు వేదాంత గేట్ ఖాళీ ప్రాంతంలో పార్కింగ్ చేసుకోవాలి. పూర్ణామార్కెట్ డీ టెంపుల్, టౌన్ కొత్తరోడ్డు పాత పోస్టుఆఫీస్, ఆర్కే జంక్షన్ మీదుగా మున్సిపల్ స్టేడియం వైపు ఎటువంటి వాహనాలను అనుమతించబోమని పోలీసు అధికారులు స్పష్టంచేశారు. ఉపముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కల్యాణ్ గురువారం రాత్రి ఇక్కడకు రాకముందు నుంచే ఈ మార్గంలో పెద్దసంఖ్యలో వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.

అసాంఘిక కార్యకలాపాలపై దాడులు

మహారాణిపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ సౌత్ జైల్ రోడ్డు, సెంట్రల్ పార్కు పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ కేతన్‌గార్గ్ హెచ్చరించారు. చీకటి పడగానే ఈ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి రావడంతో పోలీసు, రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు గురువారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించారన్నారు. గంజాయి, మద్యం తాగడంతోపాటు విచ్చలవిడిగా వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించి కొందరిని పట్టుకున్నట్లు తెలిపారు. నగరంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

'న్యాయం జరగకపోతే కోర్టును ఆశ్రయిస్తాం'

మహారాణిపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ఓపెన్ కేటగిరీలోనే రిజర్వేషన్ అభ్యర్థుల పోస్టులు లెక్కించి విద్యా శాఖ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తూ, తమకు అన్యాయం చేస్తోందని కొందరు అభ్యర్థులు ఆరోపించారు. శుక్రవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఏపీ డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటించిన జీవో 77 ప్రకారం పోస్టులు భర్తీ చేయకుండా, ఓపెన్ క్యాటగిరీలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల పోస్టులు లెక్కిస్తున్నారని ఆరోపించారు. సెలెక్షన్ లిస్టు ఇవ్వకుండా పారదర్శకతను తుంగలో తొక్కారని, రహస్యంగా కాల్ లెటర్లు ఎందుకు పంపిస్తున్నారని ప్రశ్నించారు. కటాఫ్ మార్కులు చూపించకుండా, గోప్యంగా కాల్ లెటర్లు పంపించడమేమిటని, వాటితో సర్టిఫికెట్ వెరిఫికేషన్లు ఎందుకని ప్రశ్నించారు. ఈ విధానంతో అభ్యర్థులలో చాలా అనుమానాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. సోమవారంలోగా కాల్ లెటర్లు రాకుంటే కోర్టులను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్

పలు సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చిన జనం
పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా



మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఉదయం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురు ఇచ్చిన వినతులు పరిశీలించి ఆయా సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్రలో వాడబలిజ మత్స్యకారులకు వలలు, బోట్లు ఇవ్వాలని, శిక్షణ కేంద్రాలు, పాఠశాలలు ఏర్పాటుచేయాలని సంబంధిత సంఘం ప్రతినిధులు కోరారు. రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన తనకు ఉపాధి కల్పించాలని మింది ప్రాంతానికి చెందిన దాడి అవినాశ్, వినాయక ఉత్సవాల ఊరేగింపులో సౌండ్ సిస్టమ్‌ను అనుమతించాలని ఈవెంట్ మేనేజర్ల సంఘం ప్రతినిధులు కోరారు. రోడ్డు ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన తనను ఆర్థికంగా ఆదుకోవాలని ఎలమంచిలికి చెందిన గుడాల జీవన్‌కుమార్, డిగ్రీ చదివిన దివ్యాంగురాలైన తన కుమార్తెకు ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని విశాఖలోని 91వ వార్డుకు చెందిన పి.ఆదినారాయణ కోరగా మంత్రి భరోసా ఇచ్చారు.

సకాలంలో స్థానిక ఎన్నికలు

... 5వ పేజీ తరువాయి

మంత్రి లోకేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారని తెలిసింది. ఆ సమయంలోనే స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి చెప్పారు. ప్రభుత్వంలో ఇంకా మిగిలిన నామినేటెడ్ పదవులు పంపకం త్వరలో చేపడతామన్నారు. జీవీఎంసీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి లోకేశ్ పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిన తరువాత ఇన్‌చార్జి మంత్రి నేతృత్వంలో సర్క్యూట్‌హౌస్‌లో ఎంపీ భరత్ తప్ప మిగిలిన వారంతా సమావేశమయ్యారు. రెండో డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం, నామినేటెడ్ పదవుల పంపకం కోసం నివేదికలు తయారుచేయడం, నగరంలో ఇంటింటికీ 24 గంటల తాగునీరు, రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణం, ఇతర పనులు వెంటనే పూర్తిచేసేలా జీవీఎంసీ అధికారులకు సూచించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నగర మేయర్‌కు పలు సూచనలు చేశారు.

నగరంలో సందడే సందడి

... 5వ పేజీ తరువాయి

వెళ్లి ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సదస్సులో పాల్గొన్నారు. ఆ తరువాత రాడీసన్ బ్లూ హోటల్‌కు వెళ్లి గ్రిప్పింగ్ నెట్‌వర్క్ సదస్సులో పాల్గొన్నారు. సాయంత్రం బయలుదేరి కుప్పం వెళ్లారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనడానికి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాల వీరాంజనేయస్వామి, హోం శాఖ మంత్రి అనిత, కొండపల్లి శ్రీనివాస్, తదితరులు నగరానికి వచ్చారు. ఇలా నగరం ఉదయం నుంచి సాయంత్రం వరకు కళకళలాడింది.

నంబర్‌వన్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

కలుపుతుంది కాబట్టి పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. భవిష్యత్తులో విశాఖ టెక్నాలజీ హబ్‌గా తయారుకాబోతోందని, ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి ఎంతోమంది నగరానికి వలసవచ్చే పరిస్థితి ఉంటుందని చంద్రబాబునాయుడు అన్నారు. విశాఖను రాజధాని చేస్తామని గత ప్రభుత్వం ప్రకటిస్తే...అవసరం లేదని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయాలంటూ నగరవాసులు తమ తీర్పును గత ఎన్నికల్లో ఇచ్చారని చంద్రబాబు అన్నారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో చాలాచోట్ల టీడీపీ ఓటమి పాలైనాసరే విశాఖ నగరంలోని అన్ని స్థానాల్లోనూ పార్టీ అభ్యర్థులను గెలిపించారన్నారు. అది పార్టీపై, తనపై నగరవాసులకు ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని సీఎం చంద్రబాబు వివరించారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

... 5వ పేజీ తరువాయి

రాకపోకలు సాగించే పాసింజర్ రైళ్లను (58503/58504) విశాఖ-పార్వతీపురం టౌన్ మధ్య నడిపారు. భువనేశ్వర్-ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), పూరి-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (22883) రైళ్ల నిర్ణీత సమయం కంటే నాలుగు గంటలు ఆలస్యంగా బయలుదేరేలా రీ షెడ్యూల్ చేశారు. సమాచారం తెలుసుకున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఇతర అధికారులు హుటాహుటిన విశాఖపట్నం నుంచి ఘటనా స్థలానికి చేరుకున్నారు. డీఆర్ఎం పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు.

ప్రజల ఆకాంక్షలను గుర్తించండి

... 5వ పేజీ తరువాయి

వర్క్‌లోనే పనిచేస్తానని, ఏదైనా చేయాలని అనుకుంటే చేస్తానని, చేయకూడదని అనుకుంటే చేయబోనని స్పష్టంచేశారు. ఈరోజు జనసేన నుంచి 21 మంది ఎమ్మెల్యేలు గెలిచారంటే..కోట్లాది మంది జన సైనికుల వల్లనేనని అంతా గుర్తుంచుకోవాలన్నారు. వారందరికీ ఏమి కావాలో వాటి కోసం పనిచేయాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలని నాయకులకు సూచించారు.

విశాఖపట్నం ఎప్పుడూ జనసేన పార్టీకి అండగా ఉందని, ఇక్కడి ప్రజలు తాము ఉన్నామనే భరోసా ఇచ్చారని పవన్ కల్యాణ్ అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఘటనలను గుర్తు చేసుకున్నారు. జనవాణి కార్యక్రమం కోసం విశాఖపట్నం వస్తే నోవాటెల్ హోటల్‌లో పోలీసులు నిర్బంధించారని, బయటకు రానివ్వలేదని పేర్కొన్నారు. ఈ విషయం తెలిసి ఓ మహిళా అభిమాని చంటిబిడ్డను చంకలో ఎత్తుకొని వచ్చి, పార్టీకి అండగా నడిరోడ్డుపై నిలబడిందన్నారు. అదేవిధంగా అంతకుముందు 2019 ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు తొలుత విశాఖపట్నం వస్తే వేలాది మంది అభిమానంతో వచ్చి స్వాగతం పలికారన్నారు. విశాఖతో జనసేన పార్టీ బంధం విడదీయరానిదన్నారు.

కూటమితో కలిసి ఉంటూనే పార్టీ బలోపేతం

కూటమితో కలిసి ఉంటూనే సొంతంగా జనసేన బలోపేతం అవుతుందని, దానికి పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దిశా నిర్దేశం చేశారని ఆ పార్టీ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. బీచ్‌రోడ్డులోని బే వ్యూ హోటల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటు నియోజకవర్గాల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకులతో పవన్ కల్యాణ్ మాట్లాడిన అంశాలను సుందరపు వెల్లడించారు. ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారం అయ్యేలా నాయకత్వం అభివృద్ధి చెందాలని సూచించారన్నారు. రుషికొండ ప్యాలెస్‌పై త్వరగా ఒక నిర్ణయం తీసుకోవాలని సమావేశంలో తీర్మానం చేశామని, దానిని సీఎం చంద్రబాబునాయుడుకు అందజేస్తామన్నారు. రుషికొండ పెద్ద అంశం కాదని వైసీపీ నేతలు అంటున్నారంటే..వారికి ప్రజాధనం రూ.453 కోట్లు అంటే లెక్కలేదని అర్థం చేసుకోవాలన్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం జరిగేది బహిరంగ సభ కాదని, పార్టీ క్రియాశీల కార్యకర్తల సమావేశం అని, రాత్రి 7.30 గంటల వరకు జరుగుతుందన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల వారు కూడా వస్తున్నారన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు తోట నగేశ్ పాల్గొన్నారు.

వార్డుల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పెదగంట్యాడ, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువు కాలనీలో స్మార్ట్ రేషన్ కార్డులను వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరసరఫరాల విభాగం పనితీరును పారదర్శకంగా ఉండేందుకు స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకొచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు జిత్తుక అప్పలరాజు, కార్యదర్శి కూన వెంకటరావు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కూర్మన్నపాలెం (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు వడ్లపూడి, కణితి సచివాలయాల పరిధిలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ పక్కదారి పట్టకుండా చేసిన 'స్మార్ట్' ప్రయత్నమన్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో రేషన్ తీసుకునేందుకు ప్రజలు అనేక పాట్లు పడ్డారని, నేడు కూటమి ప్రభుత్వంలో నెలలో 15 రోజులు రేషన్ డిపోలు తెరిచే ఉంటున్నాయన్నారు. దీంతో వినియోగదారులకు వీలును బట్టి రేషన్ తెచ్చుకుంటున్నారని అన్నారు. అభివృద్ధి- సంక్షేమం రెండు కళ్లగా భావించి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, ప్రగడ దానయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.



బాలా చెరువు కాలనీలో స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్న కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు



స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్

సర్కిల్-3లో 1,30,905 కార్డులు సిద్ధం

గాజువాక, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ లబ్ధిదారులకు సకాలంలో అందే విధంగా సివిల్ సప్లై అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్కిల్-3 పరిధిలో 1,30,905 స్మార్ట్ రేషన్ కార్డులను అందజేయనున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఉన్న అన్ని సచివాలయాల్లో లబ్ధిదారుకలు స్మార్ట్ కార్డుల పంపిణీ జరుగుతోంది. సచివాలయాల్లో కార్డులో పొందని వారు సెప్టెంబరు ఒకటి నుంచి పదో తారీఖు వరకు రేషన్ డిపోల్లో పొందవచ్చు. అప్పటికీ తీసుకోనివారికి సర్కిల్-3 ఏఎస్‌వో కార్యాలయంలో అందజేయనున్నారు. ప్రతి లబ్ధిదారుడికి స్మార్ట్ రేషన్ కార్డులు అంజేస్తామని ఏఎస్‌వో కృష్ణ స్పష్టం చేశారు. 65 ఏళ్ల వయసు పైబడిన వారికి నేరుగా ఇళ్ల వద్దకే వీఆర్‌వోలు వెళ్లి అందజేయనున్నారని పేర్కొన్నారు. ప్రతి లబ్ధిదారుడికి స్మార్ట్ రేషన్ కార్డులు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఆయన అన్నారు. జూన్, జూలై నెలల్లో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి రెండో విడత రేషన్ కార్డులు అందజేస్తామని తెలిపారు. ఎవరికైన స్మార్ట్ రేషన్ కార్డులు అందకపోతే నేరుగా ఏఎస్‌వో కార్యాలయంలో సంప్రదిస్తే సమస్య పరిష్కారం చేస్తామని ఏఎస్‌వో తెలిపారు.



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రెక్టార్ మధుసూదనరావు

మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళి

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగ ఇస్లాంపేట హైస్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి స్కూల్ ప్రిన్సిపాల్ జి.ప్రమీల పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడారంగానికి పేరు ప్రఖ్యాతలు తెచ్చిన మహోన్నత వ్యక్తి ధ్యాన్‌చంద్ అని అన్నారు.

అగనంపూడి (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెక్టార్ వి.మధుసూదనరావు పాల్గొని హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ సింగ్ చిత్రపటానికి వేసి నివాళులు అర్పించారు. అనంతరం ధ్యాన్‌చంద్ సాధించిన విజయాల గురించి విద్యార్థుకు వివరించారు. మేజర్ ధ్యాన్‌చంద్‌ను ఇప్పుడున్న యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

క్రీడల్లోనూ రాణించాలి

అక్కిరెడ్డిపాలెం, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను మంచి ప్రతిభ చూపించినప్పుడు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ప్రిన్సిపాల్ ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యానచంద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలు, తెలుగుభాష గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు.

'స్టీల్‌సిటీ డిపో తరలింపు ప్రక్రియను నిలిపివేయాలి'

కూర్మన్నపాలెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపో తరలింపు ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలని కోరుతూ శుక్రవారం ఎస్ఎం యూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని రీజనల్ సెక్రటరీ పి.శంకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 సంవత్సరాల లీజు పూర్తయిందని ఆర్టీసీ యాజమాన్యానికి స్టీలు సిటీ నోటీసులు జారీ చేసింది. దీంతో లీజును పొడిగించి సహకరించాలని స్టీలు సిటీ ఎస్ఎంయూ కార్మికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంయూ కార్మికులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కార్పొరేటర్

గోపాలపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్లపువానిపాలెం సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం ప్రాంగణంలో శుక్రవారం మొక్కలు నాటారు. కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ మొక్కలు నాటిన అనంతరం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు.

సినిమా గైడ్

● **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),

● **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),

● **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 38, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 32, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 28, బీరకాయలు 40, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 46, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది) 74, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	108
లైవ్ ధర	128
విత్ స్కిన్	226
స్కిన్‌లెస్	236



సీఎం ఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

పెదగంట్యాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 64వ వార్డు కొత్త దిబ్బపాలెం కాలనీకి చెందిన కదిరి సత్తిరాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. అతని కుటుంబానికి రూ.45 వేలు సీఎం సహాయనిధి మంజూరయింది. ఇందుకు సంబంధించిన చెక్కును రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మృతుని భార్య కదిరి ముక్తికి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త పసాదుల శ్రీనివాస్, 64వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కొవిరి హరికృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో ఏఐ ల్యాబ్ ప్రారంభం

గాజువాక, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గాజువాక హైస్కూల్‌లో సెయింట్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఏఐ ల్యాబ్‌ను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ విజయప్రశాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతా చర్యలు తప్పనిసరి

▸▸ ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ జి.శ్యాంబాబు



జి.శ్యాంబాబు

విశాఖపట్నం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక మండల పాల వద్ద విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ జి.శ్యాంబాబు సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనల విడుదల చేశారు. మండపాలకు తాత్కాలిక విద్యుత్తు సరఫరా కోసం అధికారిక కనెక్షన్లు తీసుకోవాలని, అనధికారికంగా విద్యుత్తు వాడితే ప్రమాదకరమని, చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. లైసెన్సు ఉన్న ఎలక్ట్రీషియన్‌తోనే ఎలక్ట్రికల్ పనులు చేయించాలని, తగిన సామర్థ్యం ఉన్న ఫ్యూజ్‌ను వాడాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ బోర్డు వినియోగించి అందులో ఎర్త్ లీకేజీ సర్క్యూట్ తప్పనిసరిగా వాడాలని పేర్కొన్నారు. ఐఎస్ఐ ప్రమాణాలు ఉన్న వైర్లు మాత్రమే వాడాలని, ప్రతి మండపానికి ప్రత్యేక ఎర్తింగ్ ఉండాలని మల్టీ ప్లగ్, ఓవర్ లోడింగ్ నివారించాలని సూచించారు. విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్లకు, విద్యుత్తు లైన్లకు కనీస దూరంలో మండపాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. లైటింగ్ కోసం ఎల్ఈడీ బల్బులు వాడాలని, సీరియల్ సెట్ వాడేటప్పుడు వాటిని లోహ వస్తువులకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విజ్ఞాన్ విద్యార్థులకు కొలువులు

అగనంపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఫైనల్ ఇయర్ చదువుతున్న 9మంది విద్యార్థులకు రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్లాండ్, నాట్‌వెస్ట్ గ్రూపు వంటి అంతర్జాతీయ బ్యాంకింగ్ సంస్థల్లో రూ.15 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ అరుంధతి తెలపారు. అలాగే మరో 8 మంది విద్యార్థులకు నెలకు రూ.55 వేల స్టైపండ్‌తో ఇంటర్నషిప్ సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను శుక్రవారం కళాశాలలో అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులను మంచి ఉద్యోగాలు సాధించేలా తీర్చిదిద్దడం వల్లే మంచి ప్యాకేజీతో కూడిన ఉద్యోగాలు సాధించారని తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి తొలి ఏడాది నుంచి విజ్ఞాన్ సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

అగనంపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి సత్రం కూడలిలో ఉన్న మహాత్మ గాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు చిత్త రామారావు, విందుల చిరురాజు తెలుగు తల్లి, గిడుగు వెంకట రామ్మూర్తి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ దేశ భాషల్లోని తెలుగు భాష గొప్పతనం, ఔనత్యం గూరించి గిడుగు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి దండ వేస్తున్న దృశ్యం

ఇస్లాంపేటలో

ఉక్కుటౌన్‌షిప్, (ఆంధ్రజ్యోతి): వ్యవహారిక భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగ ఇస్లాంపేట హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగ గిడుదు రామ్మూర్తి చిత్రపటానికి స్కూల్ ప్రిన్సిపాల్ జి.ప్రమీల పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడు తూ తెలుగు భాషా గొప్పదనాన్ని వివరించారు.

విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన లెక్చరర్‌కు రిమాండ్

పరవాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ గుత్తల శ్రీధర్‌కు రెండు వారాల పాటు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. లెక్చరర్ శ్రీధర్ ఈ నెల 23వ తేదీన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం విచారణ జరిపిన పోలీసులు.. లెక్చరర్ శ్రీధర్, సదరు విద్యార్థినిని ల్యాబ్‌కు పిలిపించి లైంగిక వేధింపులకు పాల్పడినట్టు తేలింది. శ్రీధర్‌ను శుక్రవారం అనకాపల్లి కోర్టులో హాజరుపరచగా వచ్చే నెల 12వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేసినట్టు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. నిందితుడిని అనకాపల్లి సబ్ జైలుకు తరలించినట్టు ఆయన చెప్పారు.

స్టీల్‌ప్లాంటులో కీలక విభాగాల ప్రైవేటీకరణ ఆపాలి

▸▸ అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్లాంట్‌లోని కీలక విభాగాలను ప్రైవేటీకరించేందుకు ఉక్కు యాజమాన్యం విడుదల చేసిన నోటిఫికేషన్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. తొలుత ప్లాంట్ ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగ పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ కేంద్రం అనుమతితో ఉక్కు యాజమాన్యం కీలక విభాగాల్లో ఈవోఐ ప్రకటించిందని ఆరోపించారు. గొప్ప ప్యాకేజీ ప్రకటించామని ప్రభుత్వం చెబుతున్నా, ప్రయోజనం మాత్రం శూన్యమన్నారు. ప్లాంట్‌లో వీఆర్ఎస్ ద్వారా వందల మంది ఉద్యోగులను బయటకు పంపేశారని, అదే విధంగా కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తున్నారన్నారు. ఇప్పుడు ప్లాంట్‌లోని కీలక విభాగాలను ప్రైవేటీకరించేందుకు నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ప్లాంట్‌ను నాశనం చేద్దామని కుట్ర చేస్తున్నారన్నారు. సమయానికి ప్లాంట్ యాజమాన్యం సరైన నిర్ణయాలు తీసుకోలేదని విమర్శించారు. అనంతరం ప్లాంట్ గేటు నుంచి కూర్మన్నపాలెం మీదుగా కొత్తగాజువాక వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక నాయకులు పాల్గొన్నారు.

నిమజ్జనం చేసిన పూజ సామగ్రి తొలగింపు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా స్థానికులు కృష్ణమ్మ చెరువులో వినాయక విగ్రహాలను, పూజ సామగ్రిని నిమజ్జనం చేశారు. దీంతో చెరువు మొత్తం దుర్వాసన వస్తుండడంతో పారిశుధ్య సిబ్బంది, స్థానికులు శుక్రవారం శుభ్రపరిచారు. నిమజ్జనం చేసేవారు విగ్రహాలను చెరువులో తవేసి పూజ సామగ్రిని పక్కన పడేయాలని కోరారు. పూజ సామగ్రిని కూడా నిమజ్జనం చేయడం వల్ల చెరువు పాడవుతోందని స్థానికులు అంటున్నారు.

నెల రోజుల్లో పెందుర్తిలో డీపీఆర్‌సీ భవనం

● ఇంజనీర్లకు రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశం

పెందుర్తి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనరు కృష్ణతేజ శుక్రవారం పెందుర్తిలో ఆకస్మికంగా పర్యటించారు. మండల పరిషత్ స్థలంలో ఏడేళ్లగా నిర్మాణంలో ఉన్న జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్ (డీపీఆర్‌సీ) భవనాన్ని పరిశీలించారు. నిధులు చాలక రెండు ఫ్లోర్లు వేసి నిర్మాణాన్ని వదిలేశారు. ఈ క్రమంలో ఇటీవల జెడ్పీ సీఈవో ప్రత్యేక నిధులు రూ.1.5 కోట్లు మంజూరు చేయడంతో పనుల్లో కదలిక వచ్చింది. ఈ నేపథ్యంలో కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించి పూర్తిచేయవలసిన పనులపై ఆరా తీశారు. నెల రోజుల వ్యవధిలో పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆరుగురు కాంట్రాక్టర్లతో పనులు చేయిస్తున్నట్లు పీఆర్ డీఈ పీవీ రమణమూర్తి ఆయనకు తెలిపారు. ఈ భవనాన్ని అత్యున్నతంగా తీర్చిదిద్దాలన్నారు. ఇది అందుబాటులోకి వస్తే స్థానిక సంస్థలు, మండల పరిషత్,పంచాయతీల ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుపడుతుందన్నారు. అంతకుముందు రాజయ్యపేటలో సైదా స్థలాన్ని కమిషనర్ పరిశీలించారు.



సర్పంచుల సంఘం ప్రతినిధుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ

సర్పంచుల వినతి

జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షురాలు చింతకాయల సుజాత ఆధ్వర్యంలో సరిపల్లి, జంగాలిపాలెం, జుత్తాడ సర్పంచులు గొర్లె రామకృష్ణ, జగన్నాథం, గొరపల్లి నర్సింగరావు, బొడ్డు వాణిప్రకాశ్ తదితరులు కమిషనర్ కృష్ణతేజను మర్యాదపూర్వకంగా కలిశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని, పంచాయతీలకు బకాయిపడిన రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ చెల్లింపులు ఖాతాలకు జమ చేయాలని విజ్ఞప్తి చేయగా, సెప్టెంబరు మొదటి వారంలో విడుదల చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. తొలుత తమ సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించేందుకు కమిషనర్ దగ్గరకు వచ్చే క్రమంలో ఆయన వాహనం కదిలింది. ఆయనను కలిసే తొందరలో ముత్యాలమ్మపాలెం సర్పంచ్ భర్త రహదారిపై తుల్లి పడిపోయారు. ఇది గమనించిన కమిషనరు వెంటనే కారు దిగి ఆయన దగ్గరకు వెళ్లారు. ఇదే సమయంలో సర్పంచులు ఆనందంతో కమిషనర్ కృష్ణతేజను దుశ్శాలువతో సత్కరించి పంచాయతీల సమస్యలను వివరించారు. ఎంపీడీవో గుండాల అప్పలరాజు, పరిషత్ పర్యవేక్షణ అధికారి కొల్లి వెంకట్రావు, డీఈ రమణ మూర్తి ఉన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణ



ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు తదితరులు

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని విమాన్‌నగర్, కాకానీనగర్‌లలో ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో విమాన్‌నగర్ 100 అడుగుల రోడ్డులో శుక్రవారం ఉదయం ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని విశాఖ ఎంపీ శ్రీభరత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు సినీరంగంలోనే కాకుండా రాజకీయ రంగంలోనూ చేసిన సేవలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. పేదల సంక్షేమానికి ఆయన తీసుకున్న చర్యలు, అమలు చేసిన పథకాలు ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయనాన్నరు. ఇక్కడి కాలనీ అసోసియేషన్‌లో అభిమానులు కలిసి పండగలా విగ్రహావిష్కరణకు పూనుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ ఈ కాంస్య విగ్రహ రూపశిల్పి కొత్తపేటకు చెందిన రాజ్‌కుమార్ ఒడయార్ సేవలను కొనియాడారు. ఎన్టీఆర్ మనమధ్యనే ఉన్నట్లుగా విగ్రహం కనిపిస్తుందన్నారు. మధ్యాహ్నం వెయ్యి మందికి అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో విమాన్‌నగర్ కాలనీ అధ్యక్షుడు గొట్టిపాటి వెంకట సురేష్‌కుమార్, చాయిస్ ఎలివేటర్ అధినేత అబ్దుల్ బషీర్, వి.శ్రీకాంత్, కృష్ణ, అనిల్, ఎస్.రాజు, సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన భార్య, కుమారుడి అప్పగింత

పెందుర్తి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల కిందట తప్పిపోయిన భార్య, కుమారుల జాడ కనుగొని ఆమె భర్తకు అప్పగించినట్లు సీఐ కె.వి.సతీశ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పెందుర్తి పోలీసు స్టేషన్ పరిధి పాపయ్యరాజుపాలెంలో బోరాడ సంతోష్, అతని భార్య నాగమణి(26), కుమారుడు నివాస్(6) ఉండేవారు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం ఇంటిలో చెప్పకుండా నాగమణి తన కుమారుడు నివాస్‌ను తీసుకుని బయటకు వెళ్లిపోయింది. భార్య, కుమారుడి అదృశ్యంపై సంతోష్ పోలీసులకు గతంలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు వారి జాడ కోసం ముమ్మరంగా గాలించారు. సీఐ సతీశ్‌కుమార్ అదృశ్యం (మిస్సింగ్) కేసులపై ప్రత్యేక దృష్టి సారించడంతో సాంకేతిక సహాయంతో వారి జాడను కనిపెట్టగలిగారు. తప్పిపోయిన నాగమణి, నివాస్‌లను శుక్రవారం పోలీసు స్టేషన్‌లో సంతోశ్‌కు అప్పగించారు.

బంక్ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



ఫుట్‌పాత్ ఆక్రమణల్ని పరిశీలిస్తున్న సీఐ

గోపాలపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక బంక్ కూడలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సీఐ కె.సురేశ్ ఆధ్వర్యంలో నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. ఇక్కడి దుకాణదారులు ఫుట్‌పాత్‌లు ఆక్రమించడం, ఇష్టానుసారంగా వాహన రాకపోకలు, రహదారిపైనే వాహన పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. వర్తకులు పాదచారులకు, వాహన చోదకులకు ఇబ్బంది కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల వాటిల్లే ఇబ్బందులపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ ఆర్.సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

'స్మార్ట్ మీటర్లు రద్దు చేసే వరకు పోరాటం'


మల్కాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు రద్దు చేసేవరకు సీపీఎం తన పోరాటాన్ని కొనసాగిస్తుందని విద్యుత్ ఉద్యమంలో అసులుబాసిన అమరవీరుల సాక్షిగా శుక్రవారంఆ పార్టీ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. ములగాడ హౌసింగ్ కాలనీ, నెహ్రూనగర్, గుల్లలపాలెం జంక్షన్లలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మల్కాపురం జోన్ నాయకుడు పి.పైడిరాజు మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించిన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిలు పోలీసు కాల్పులలో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారి చిత్రపటాల వద్ద నివాళులర్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, సత్యారావు, రామునాయుడు, దున్నా రాజేష్, రామకృష్ణ ప్రశాంత్, సురేష్, హేమంత్, ఈశ్వరరావు, శ్రీను, పైడినాయుడు, రాంబాబు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వినాయక ఉత్సవాలు



గోశాల దరి బాలాజీనగర్‌లో పడవపైన దశావతారాల్లో వినాయకుడు

వేపగుంట, ఎన్.ఎ.డి.జంక్షన్ ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93, 98 వార్డుల పరిధిలో వినాయక ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గోశాల దరి ఎస్.ఎస్.ఆర్. కల్యాణమండపం ముందు బాలాజీనగర్ ఫ్రెండ్లీ గాయ్స్ ఆధ్వర్యంలో చేపట్టిన మండపం కళాత్మకంగా ఉంది. టీటీడీ తరహాలో ముందు దశావతారాలు సెట్ లోపల పడవపైన వినాయకుల ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. ఈ సెట్ వేయటానికి దాదాపు రూ.3.50 లక్షలు ఖర్చయినట్లు నిర్వాహకులు తెలిపారు. గొల్లనారాయణపురంలో గణేష్ యంగ్ గాయ్స్ నిర్వహణలో శివుని చేతిలో ఉన్న వినాయకుడు విగ్రహం అలరిస్తుంది. 90వ వార్డు పరిధిలోని కాకానీనగర్‌లో యునైటెడ్ యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాలరాతి వినాయక విగ్రహం ఆకర్షణగా నిలిచింది. బాజీజంక్షన్ దరి కరణాల వీధిలో యంగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 11 అడుగుల విగ్రహం వెనుక క్లాత్ డెకరేషన్, ముందు శివుని సెట్ అలరిస్తోంది.



కాకానీనగర్‌లో ఏర్పాటుచేసిన పాలరాతి ప్రతిమ



గోపాలపట్నం నరసింహ థియేటర్ వద్ద అన్న సమారాధన

గోపాలపట్నం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక నరసింహ థియేటర్ సమీపంలో పవార్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఘనంగా అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకుడు దీపక్ పవార్ అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 2 వేల మంది స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా చంద్రబాబు పర్యటన



డబుల్ డెక్కర్ బస్సు ఎక్కే ముందు సీఎం చంద్రబాబునాయుడుకు బ్యాడ్జి పెడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.. పక్కన టికెట్ కొనుగోలు చేస్తున్న ముఖ్యమంత్రి. చిత్రంలో ఎంపీ శ్రీభరత్ ఉన్నారు


డబుల్ డెక్కర్ బస్సులో కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, తదితరులు


నోవాటెల్ హోటల్‌లో ఇండియా ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ సదస్సుకు హాజరైన చంద్రబాబుకు నమస్కరిస్తున్న ప్రముఖులు


సదస్సుకు హాజరైన ప్రముఖులు


నోవాటెల్ హోటల్‌లో ముఖ్యమంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం


డబుల్ డెక్కర్ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నగర పర్యటన శుక్రవారం ఆద్యంతం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. ఇందులో భాగంగా చంద్రబాబు తొలుత హోటల్ నోవాటెల్‌లో ఇండియా ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ సదస్సులో పాల్గొన్నారు. అనంతరం ఆయన రాష్ట్ర పర్యాటక శాఖ-జీవీఎంసీ సంయుక్తంగా బీచ్ రోడ్డులో నడపనున్న రెండు డబుల్ డెక్కర్ (హాప్ ఆన్-హాప్ ఆఫ్) బస్సులను కాళీమాత ఆలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. కాసేపు ఆ బస్సులో చంద్రబాబుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సరదాగా పర్యటించారు. ఆ తరువాత రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగిన గ్రిఫిన్ ఫౌండర్ నెట్‌వర్క్ మీటింగ్‌లో చంద్రబాబు పాల్గొన్నారు.


హోటల్ నోవాటెల్‌లో సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న చిరంజీవి చౌదరి

ముఖ్యమంత్రికి ఆత్మీయ వీడ్కోలు

గోపాలపట్నం: నగర పర్యటనను ముగించుకున్నాక సీఎం చంద్రబాబు సాయంత్రం 4.30 గంటలకు విమానాశ్రయానికి రోడ్డు మార్గం గుండా చేరుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజేయస్వామి, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పి.గణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, పి.విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, డీసీపీ మేరీ ప్రశాంతి, ఆర్డీవో పి.శ్రీలేఖ, తదితరులు ముఖ్యమంత్రికి ఆత్మీయ వీడ్కోలు పలికారు. అనంతరం చంద్రబాబు 4.53 గంటలకు ప్రత్యేక విమానంలో బెంగళూరు బయలుదేరి వెళ్లారు.


ఎయిర్‌పోర్టులో చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నగరంలో పవన్‌కల్యాణ్


రుషికొండ భవన పరిశీలనకు వెళ్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నాదేండ్ల మనోహర్, తదితరులు


ఊడిపడిన ఫాల్స్ సీలింగ్‌ను పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్. చిత్రంలో మంత్రి మనోహర్ ఉన్నారు


రుషికొండ ప్యాలెస్‌లోని ఒక రూమ్‌ను తిలకిస్తున్న పవన్‌కల్యాణ్


రుషికొండ భవనంలో సమావేశమైన పవన్‌కల్యాణ్, మంత్రులు నాదేండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేశ్‌బాబు, ఇతర ప్రముఖులు


బే వ్యూ హోటల్‌లో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్


పవన్‌కల్యాణ్‌కు పుస్తకాన్ని బహూకరిస్తున్న జనసైనికుడు

నారా లోకేశ్ సుడిగాలి పర్యటన

రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. ఇందులో భాగంగా భారత విమానయాన మంత్రిత్వ శాఖ, సీఐఐ, సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్ సంయుక్తంగా హోటల్ నోవాటెల్ సదస్సులో పాల్గొనడంతో పాటు రాడిసన్ బ్లూ హోటల్‌లో ఏఐ ల్యాబ్స్, స్టెమ్, రోబోటిక్స్ ల్యాబ్స్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. వరల్డ్ కప్ క్రికెట్ టోర్నీకి సన్నద్ధమవుతున్న భారత్ మహిళల క్రికెట్ జట్టు క్రీడాకారిణులను కలిశారు. చంద్రంపాలెం హై స్కూల్‌లో కాసేపు విద్యార్థులతో సరదాగా లోకేశ్ ముచ్చటించారు. అలాగే ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సదస్సును ప్రారంభించాక ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన జాతీయ క్రీడా దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టీడీపీ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం రాత్రి ప్రత్యేక విమానంలో విజయవాడ బయలుదేరి వెళ్లారు. ఎయిర్‌పోర్టులో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, తదితరులు వీడ్కోలు పలికారు.


జ్యోతి ప్రజ్వలన చేసి ఐసీఏఐ సదస్సును ప్రారంభిస్తున్న నారా లోకేశ్. చిత్రంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తదితర ప్రముఖులు



అంతర్జాతీయ ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ సదస్సులో పాల్గొన్న లోకేశ్, రామ్మోహన్‌నాయుడు


చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థినులతో ముచ్చటిస్తూ..


ఐసీఏఐ సదస్సులో లోకేశ్‌కు చిత్రపటాన్ని బహూకరిస్తున్న ప్రతినిధులు


ప్రాజెక్టు గురించి మంత్రికి వివరిస్తున్న చంద్రపాలెం హైస్కూల్ విద్యార్థినులు


మహిళా క్రికెటర్లు, తదితరులతో నారా లోకేశ్


టీడీపీ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలు వింటూ..

భార్య, పిల్లల అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

పెందుర్తి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తన భార్య, ఇద్దరు పిల్లలు (కుమారుడు, కుమార్తె) అదృశ్యమైనట్లు ఉల్లాపు రత్నాకర్ అనే వ్యక్తి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పెందుర్తి మండలం నాయుడుతోటకు చెందిన ప్రైవేటు ఉద్యోగి ఉల్లాపు రత్నాకర్, భార్య శైలజ(27), కుమార్తె లిస్సీ (6), రిషికుమార్ (2)తో కలిసి ఉంటున్నారు. ఇటీవల దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో జూలై 20న ఇద్దరు పిల్లలతో శైలజ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంతవరకు ఇంటికి చేరుకోలేదు. వారి ఆచూకీ కోసం రత్నాకర్ బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం దక్కలేదు,. భార్య సెల్‌ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ చేసి ఉంది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో ఏరోస్పేస్ ఉత్పత్తులు

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఏరోస్పేస్ రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఉత్పత్తులు తయారుచేయాలని, ఆ దిశగా ఇప్పటికే భారత్ ముందుకు సాగుతోందని కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మో హన్ నాయుడు అన్నారు. విడి భాగాల తయారీ నుంచి పోటీతత్వం వరకు భారతదేశ ఏరో స్పేస్ తయారీ, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్, ఆప రేషన్స్) రంగాలను వేగవంతం చేయడం అనే అంశంపై భారత విమానయాన మంత్రిత్వ శాఖ, కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ), సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మ్యాన్‌ఫ్యాక్చరర్స్ సంయుక్తంగా శుక్రవారం విశాఖలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏరో స్పేస్ రంగంలో మాను ఫ్యాక్చరింగ్ రంగంలో ఇండియా కన్స్యూమర్ కాకూడదని, ప్రొడ్యూసర్ (ఉత్పత్తిదారు) కావాలని ఆకాంక్షించారు. ఇండియాలో మానుఫ్యాక్చరింగ్ రంగం బెంచ్ మార్క్‌ను అందుకుందన్నారు. ప్రపంచానికి తక్కువ ఖర్చుతో అధునాతన సాంకేతికతను ఎలా సంపాదించుకోవచ్చనే విషయాన్ని ఇండియా చేసి చూపించిందన్నారు. గ్లోబల్ స్టాండర్డ్స్‌తో తక్కువ ఖర్చుతో ఏరో స్పేస్ సెక్టార్‌లో అనేక మైలురాళ్లను సాధించిందన్నారు. మహిళలు పైలెట్లుగా గ్లోబల్ యావరేజ్ 5 శాతం ఉంటే, దేశంలో 25 శాతం ఉందన్నారు. దీన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు చెప్పినట్టు విలువైన భాగస్వామ్యం కేంద్రం, రాష్ట్రంలో నడుస్తోందన్నారు. ఏపీలో ఏరో స్పేస్ రంగం విస్తరణకు చంద్రబాబు రెక్కలు అందించారని, గ్లోబల్ ఏవియేషన్ మార్కెట్‌లో 900 బిలియన్ డాలర్స్ మార్కెట్ సంపాదించుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీ శ్రీ భరత్, సీఐఐ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న రామ్మోహన్ నాయుడు

» కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

కోటి లింగాల వినాయక విగ్రహంతో పర్యావరణ ఇబ్బందులు

» ప్లాస్టిక్ ఆఫ్ పారిస్ వినియోగంపై ఓ విద్యార్థిని అభ్యంతరం

» కలెక్టర్, ముఖ్య అధికారులు, లంబోదర ట్రస్ట్‌కు నోటీసులు


విద్యార్థిని సాహితి

మల్కాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం సమీపంలోని కొత్తనక్కవానిపాలెం వద్ద ఆంధ్రప్రదేశ్ చిన్నతరహా పరిశ్రమల శాఖ (ఏపీఐఐసీ) స్థలంలో లంబోదర ట్రస్ట్ రూపొందించిన కోటి లింగాల వినాయక విగ్రహంతో పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందంటూ గాజువాక ప్రాంతానికి చెందిన గొంప సాహితి (8వ తరగతి) అనే విద్యార్థిని అభ్యంతరం తెలిపింది. కాంద్రేగుల లీల హరిప్రసాద్ అనే న్యాయవాది ద్వారా శుక్రవారం సంబంధిత ట్రస్ట్‌కు, కలెక్టర్, జీవీఎంసీ, నగర పోలీసు, పర్యావరణ పరిరక్షణ కమిషనర్లకు నోటీసులు పంపింది. కోటి లింగాలకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) వినియోగించడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని అధికారులకు తెలిసినా ట్రస్ట్‌కు అనుమతించడంపై అభ్యంతరం తెలిపింది. ఈ నోటీసుకు 15 రోజులలో సమాధానం ఇవ్వాలని, కోటి మొక్కలు నాటాలని డిమాండ్ చేసింది. సరైన సమాధానం ఇవ్వకపోతే హైకోర్టును ఆశ్రయిస్తానని పేర్కొంది. బాల్యం నుంచి పర్యావరణ పరిరక్షణ కోసం పోరాడుతున్నానని, పుట్టినరోజు వేడుకలు, పెళ్లిళ్లకు వెళ్లి మొక్కలను బహుమతిగా ఇస్తుంటానని తెలిపింది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కూడా కలిసి పర్యావరణ పరిరక్షణ కోసం వివరించడంతో ఆయన తనను అభినందించారని పేర్కొంది. తనకు నాలుగుసార్లు జాతీయ స్థాయిలో ప్రైవేటు సంస్థల నుంచి పర్యావరణ పరిరక్షణ అవార్డులు కూడా వచ్చాయని గుర్తుచేసింది. తాను మొక్కల పెంపకం చేపడుతూ, వాటిని అమ్మగా వచ్చిన డబ్బును కిడ్నీ రోగుల చికిత్సకు ఇస్తానని పేర్కొంది.

నడి రోడ్డుపై వ్యక్తి ఆత్మహత్యాయత్నం

» శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడంతో చెలరేగిన మంటలు

» కేజీహెచ్‌కు తరలింపు

» కుటుంబ కలహాల నేపథ్యంలో దుశ్చర్య


ఆత్మహత్యాయత్నం చేసుకున్న పుట్ట చిన్నారావు

ఆరిలోవ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ఆఖరి బస్టాపు సమీపంలో గల మద్యషాపునకు దగ్గరలో పుట్ట చిన్నారావు (40) శుక్రవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో నడి రోడ్డులో శరీరంపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైన స్థానికులు అంతలోనే తేరుకొని మండలను ఆర్పి సమాచారం అందించడంతో 108 సిబ్బంది చేరుకొని చిన్నారావును కేజీహెచ్‌కు తరలించారు. దీనిపై సీఐ మల్లేశ్వరరావు మాట్లాడుతూ.. ఆత్యహత్యాయత్నానికి పాల్పడిన చిన్నారావు ఆరిలోవలో కుటుంబంతో నివసిస్తున్నట్టు చెప్పారు. అతడికి భార్య లత, ఇద్దరు పిల్లలు ఉన్నారు, మద్యానికి బానిసైన చిన్నారావు ఇంటి బాధ్యతలు నిర్వర్తించడం లేదని, ఇంటికి డబ్బులు ఇచ్చేవాడు కాదని తెలిపారు. ఈ నేపథ్యంలో కుటుంబ కలహాలు తలెత్తడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయనట్టు వెల్లడించారు.